సాక్షి మహబూబ్‌నగర్
మంగళవారం ı 11 ı జూలై ı 2023



కప్లాపూర్‌లో డెంగీ..
గండేడ్ మండలంలోని కప్లాపూర్‌లో వారం రోజులుగా డెంగీ వ్యాధి విజృంభిస్తోంది.
వివరాలు 8లో ▸



విద్యుత్ సరఫరాకు ఆటంకం
హరితహారంలో నాటుతున్న మొక్కలు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్నాయి.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.4 /23.4
ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వెనకబడిన కులాల దరఖాస్తులు పరిశీలించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే **పరిష్కరించాలని** కలెక్టర్ రవినాయక్ **అన్నారు.** సోమవారం కలెక్టరేట్‌లో **ప్రజల నుంచి** ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారమయ్యే వాటిని అక్కడే పరిష్కరించాలని, అలా కాని వాటిని మాత్రమే జిల్లాస్థాయికి పంపించాలన్నారు. తహసీల్దార్లు తమ పరిధిలోని రైస్‌మిల్లును తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. ఈ విషయంలో జాప్యం చేయొద్దని, జిల్లా పౌర సరఫరాల మేనేజర్, అధికారులు సైతం కొన్ని మిల్లులను తనిఖీ చేసి నివేదిక అందించాలన్నారు. వెనకబడిన కులాల ఆర్థిక సాయం కోసం వచ్చిన అన్ని దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 15,787 దరఖాస్తులు రాగా ఇంకా 5 వేల ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్నారు. తెలంగాణకు హరితహారంలో భాగంగా ఇది వరకు రూపొందించిన కార్యాచరణ ప్రకారం అంచనాలను పంపించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకం కింద సోక్‌పిట్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, ప్రతి గ్రామానికి 5 చొప్పున ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కేజీబీవీలను ఎంఈఓ, ఇతర అధికారులు తనిఖీ చేసి నివేదిక అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, డీఆర్‌డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ శాఖపై సమీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ పనితీరుపై మంగళవారం విద్యుత్ భవన్‌లోని మీటింగ్ హాల్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి విద్యుత్ శాఖ డీఎండీ రఘుమారెడ్డితోపాటు డైరెక్టర్లు, ఉమ్మడి జిల్లాలోని ఎస్‌ఈలు హాజరుకానున్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాతోపాటు విద్యుత్ బిల్లుల వసూళ్లపై సమీక్షించనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన వివిధ ఉద్యోగాల భర్తీకి గాను అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అవార్డు ఏజెన్సీ ప్రతినిధి కుసుమ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ–ఫిజిక్స్, ఇంగ్లిష్, టీజీటీ– మ్యాథమెటిక్స్, జేఎల్–మ్యాథమెటిక్స్ రెండు చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీజీటీ–తెలుగు, జేఎల్– ఇంగ్లిష్, కెమిస్ట్రీ, బాటనీలో ఒక్కొక్కటి పోస్టుల కోసం గ్రాడ్యుయేట్‌తో పాటు బీఈడీలో సంబంధిత మెథడాలజీ కలిగి ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12 తేదీ లోగా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.98661 23315లో సంప్రదించవచ్చని తెలిపారు.

12న 'చలో హైదరాబాద్'

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రామదాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం జేఏసీ దశల వారీ పోరాటాల్లో భాగంగా ఇందిరా పార్కులో మహాధర్నా చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆముదాలు @ రూ.7,390

జడ్చర్ల: బాదేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఆముదాలు క్వింటాల్‌కు రూ.5,832 ధర లభించింది. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,155, కనిష్టంగా రూ.2,100, జొన్నలు రూ.4,400, వరి హంసకు రూ.1,414, ఆర్‌ఎన్‌ఆర్‌కు రూ.2,223 ధరలు వచ్చాయి.

విచారణ ఉత్తదేనా!

'పోలేపల్లి' కాలుష్య పరిశ్రమలపై చర్యలు శూన్యం

- అమలుకు నోచుకోని గత కలెక్టర్ ఆదేశాలు
- పట్టించుకోని వివిధ శాఖల అధికారుల బృందం
- నోటి మాటగానే మిగిలిన నెలనెలా తనిఖీలు
- ఈ వర్షాకాలం సీజన్‌లో మళ్లీ పొంచి ఉన్న ముప్పు
- తీవ్ర ఆందోళనలో సెజ్ పరిసరాల్లోని రైతులు
- భూములు అమ్ముకోక తప్పదని ఆవేదన

గతేడాది వర్షాకాలంలో ఫార్మా కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా బయటకు వదులుతున్న విషపు జలాలకు సంబంధించి ఆధారాలతో సహా ప్రభుత్వ యంత్రాంగానికి సమర్పించాం. పాత కలెక్టర్ వెంకట్రావ్ స్పందించి



వివిధ శాఖలతో అధికారులతో కమిటీ వేసి.. కలుషిత నీటిని వదలకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంవత్సరం దాటినా.. ఇప్పటివరకు ఏ కంపెనీపైనా చర్యలు తీసుకోలేదు. నిన్న, మొన్న ముసురు వాన కురవగానే.. కంపెనీలు మళ్లీ కాలుష్యపు జలాలను మా పొలాల్లోకి వదిలాయి. పంటలు పండకపోవడంతో పాటు పాడి పశువులు చనిపోతున్నా.. మమ్మల్ని పట్టించుకునే వారే లేరు. ఇక భూములు అమ్ముకోక తప్పదేమో.. చివరకు మా చావులనే చూడాలని ఉందేమో. ..ఇది వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న రాజాపూర్ మండలం రాయపల్లికి చెందిన రైతు పాలెం విఠలయ్య గౌడ్ ఆవేదన. ..ఈ పరిస్థితి ఇతనొక్కరిదే కాదు.. పోలేపల్లి సెజ్ పరిధిలో పంట పొలాలు సాగు చేసుకుంటున్న అన్నదాతలందరిదీ. కాలుష్య పరిశ్రమలపై కానరాని చర్యల నేపథ్యంలో గత కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన విచారణ ఉత్తదేనా.. నెలనెలా తనిఖీలు నోటి మాటలేనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

తనిఖీల మాటే మరిచారు..

విచారణ అధికారుల బృందంతో భేటీ సందర్భంగా పొల్యూట్ అయిన ప్రాంతాల్లో విధిగా పర్యటించాలని.. ఆయా పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. ప్రతి నెలా 11వ తేదీన.. ఒకవేళ ఆ రోజు సెలవు దినమైతే మరుసటి రోజు సదరు అధికారుల బృందం ఆయా గ్రామాలను సందర్శించాలని చెప్పారు. పరిశ్రమల ప్రతినిధులు, స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత కలెక్టర్ వెంకట్రావ్ సూర్యాపేటకు బదిలీ కాగా.. అధికారులు తనిఖీల మాటే మరిచిపోయారు. మళ్లీ వర్షాకాలం రావడం.. నిబంధనలు పట్టని ఫ్యాక్టరీలు, తనిఖీలు మరిచిన అధికారులు, పట్టించుకోని ప్రజాప్రతినిధులు వెరసి రైతులు తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు.



నీటి ప్రవాహం ధాటికి కూలిన కంపెనీ గోడ



20 రోజుల క్రితం ఓ ఫార్మా కంపెనీ నుంచి తూముల ద్వారా బయటకు విడుదల చేసిన కాలుష్యపు నీరు

ప్రస్తుత కలెక్టర్ దృష్టి సారించాలి..



కంపెనీలు కాలుష్యపు నీళ్ల వదులుతున్నాయని ఎన్నిసార్లు చెప్పినా పీసీబీకి పట్టదు. మా పొలాలు గుంజుకున్న టీఎస్ఐఐసీ వాళ్లకు కూడా పట్టదు. ఎందుకంటే ఆ రెండు శాఖల సిబ్బందికి కంపెనీలు నెలనెలా ఇచ్చే ముడుపులే ముఖ్యం. ఫిర్యాదు చేస్తే రెండు రోజులు హల్‌చల్ చేస్తారు. ఆ తర్వాత సెటిల్‌మెంట్ చేసుకుంటారు. అంతే తప్ప రైతులకు సపోర్ట్ చేసే ఆలోచన ఎవరికీ లేదు. ఈ కలెక్టర్ సార్ అయినా పట్టించుకోవాలి. గత కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన విచారణలో శాఖల వారీగా ఇచ్చిన నివేదికలు బహిర్గతం చేయడంతోపాటు సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– రాజు, రాయపల్లి, రాజాపూర్

కమిటీ నివేదిక అటకెక్కినట్లేనా..

జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ పరిధిలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై రైతులు, ప్రజలు ఎన్నో ఏళ్లుగా పోరు సాగిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సదరు పరిశ్రమల ప్రతినిధులు, రైతులను హైదరాబాద్‌కు పిలిపించుకుని మాట్లాడడం జరిగేది. అయితే గత ఏడాది వర్షాలు కురిసిన క్రమంలో దీన్ని అదునుగా చేసుకొని పలు ఫార్మా పరిశ్రమల నిర్వాహకులు కాలుష్యపు నీటిని ఎక్కువ మొత్తంలో బయటకు పంట పొలాలు, కుంటలు, చెరువుల్లోకి వదిలాయి. దీంతో రైతులు పోరు తీవ్రం చేయడంతో దిగొచ్చిన అప్పటి కలెక్టర్ వెంకట్రావ్.. వివిధ శాఖల అధికారులతో విచారణ కమిటీని నియమించారు. ఈ ఏడాది జనవరి 31న విచారణ బృందంతో సమావేశం నిర్వహించిన ఆయన శాఖల వారీగా నివేదికలు అందుకున్నారు. వీటిని ఎన్జీటీతో పాటు పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుకు చెందిన ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఆ తర్వాత ఆయన సూర్యాపేటకు బదిలీ కావడంతో ఈ విషయం మరుగున పడినట్లయింది. అయితే ఐదునెలలు గడిచినా సదరు కంపెనీలపై ఇటు జిల్లా అధికార యంత్రాంగం గానీ, అటు హైదరాబాద్‌లోని పీసీబీ అధికారులు గానీ చర్యలు చేపట్టకపోవడంతో నివేదికలు అటకెక్కినట్లేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవును.. నిజమే

- 'పోలేపల్లి' పరిసరాలు కాలుష్యమయ్యాయి..
- పలు ప్రభుత్వ శాఖలు సమర్పించిన నివేదికలు బహిర్గతం
- ముందే చెప్పిన 'సాక్షి'



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పోలేపల్లి సెజ్ పరిధిలోని జడ్చర్ల, రాజాపూర్ మండలానికి చెందిన పలు గ్రామాలు కలుషితం బారిన పడ్డాయని 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ప్రధానంగా ఫార్మా పరిశ్రమల నుంచి బయటకు వదులుతున్న విషజలాలతో పంటలు పండక వ్యవసాయ భూములు బీళ్లుగా మారుతుండడం.. చెరువులు, కుంటల్లో చేపలు ఎదగకపోవడంతో పాటు రోగాల బారిన పడుతుండడం.. పలు గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు చర్మ వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్న తీరును ఆధారాలతో సహా వెలుగులోకి తేగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎట్టకేలకు స్పందించిన అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ వ్యవసాయ, భూగర్భ జల, వైద్యం, మత్స్యశాఖతో పాటు పీసీబీ తదితర విభాగాల ఆధ్వర్యంలో విచారణ కమిటీ నియమించగా.. ఈ ఏడాది జనవరి 31న ఆయా అధికారులు నివేదికలు సమర్పించారు. అయితే నివేదికల్లోని అంశాలపై ఇన్నాళ్లు గోపత్యను పాటించగా.. ఇటీవల బహిర్గతమయ్యాయి. ఇందులో కళ్లు చెదిరే నిజాలు వెలుగులోకి రాగా.. కాలుష్యంపై 'సాక్షి' చెప్పిందే నిజమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నష్ట నివారణ చర్యలు చేపట్టాలని బాధితులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధాన శాఖల వారీగా నివేదికలో పేర్కొన్న అంశాలు..

వ్యవసాయ శాఖ
పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా కంపెనీలు వదులుతున్న కాలుష్యపు జలాల కారణంగా పరిసర భూములు సాగుకు పనికి రాకుండా పోయాయని వ్యవసాయ అధికారులు నివేదిక సమర్పించారు. పొలాల్లో మట్టి, వ్యవసాయ బోర్లలోని నీటిని సేకరించి, పరీక్షలు జరిపి ఫలితాలను అందులో పొందుపర్చారు. భూమిలో సారం పూర్తిగా తగ్గి.. ఉండాల్సిన దానికంటే ఎక్కువ మోతాదులో లవణాలు ఉన్నాయని పేర్కొన్నారు.



మత్స్యశాఖ
ముదిరెడ్డిపల్లిలోని పల్లె చెరువులో నీటిని సేకరించి.. పరీక్షించగా కలుషితమైనట్లు తేలిందని మత్స్యశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ చెరువులో చేపలు అనుకున్న సైజులో పెరగవని.. రోగాల బారిన పడతాయని నివేదికలో పేర్కొన్నారు.

భూగర్భ జలశాఖ
సెజ్ పరిధిలో రైతులకు చెందిన వ్యవసాయబోర్లలోని నీటిని సేకరించి ల్యాబ్‌లో పరీక్షించగా.. నీరు పూర్తిగా కలుషితమైనట్లు భూగర్భ జలశాఖ అధికారులు తేల్చి చెప్పారు. ఈ బోర్లలోని నీరు తాగడానికి పనికిరాదని పేర్కొన్నారు.

వైద్యారోగ్య శాఖ
ముదిరెడ్డిపల్లి గుండ్లగడ్డ తండా తదితర గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించగా.. పలు ప్రాంతాలు పొల్యూటెడ్ అయినట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తేల్చారు. ప్రజలు చర్మ సంబంధిత రోగాల బారిన పడుతున్నారని నివేదికలో పొందుపరిచారు.

ఇప్పుడా.. ఎందుకో.. ఏమో..!

- నేడు సెజ్‌లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ
- అన్నింటికీ ఒకటే చోట..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ పరిధిలోని పలు పరిశ్రమలకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు సెజ్‌లోని ఇండస్ట్రియల్ పార్క్ ఆవరణలో సమావేశానికి ఏర్పాట్లు చేశారు. లెక్కప్రకారం పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం సంబంధిత ప్రాంత ప్రజలు, ఎన్జీఓలు, వివిధ సంఘాల నుంచి ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ముందుగానే అభిప్రాయాలను సేకరిస్తారు. మెజార్టీ అభిప్రాయాల ప్రకారం ప్రభుత్వం అనుమతులు ఇస్తుంది. కానీ పరిశ్రమలు స్థాపించి 20 ఏళ్ల తర్వాత పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధికారులను సంప్రదిస్తే ప్రస్తుతం ఆయా పరిశ్రమలకు సంబంధించి కాలుష్యం, తదితర సమస్యలపై సలహాలు స్వీకరిస్తున్నామని చెబుతున్నారు. అయితే ఒక్క పోలేపల్లి సెజ్ పరిధిలోని పరిశ్రమలే కాదు.. తదితర ప్రాంతాల్లో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల, బాయిల్డ్ రైస్ మిల్లులు, కెమికల్ కంపెనీల ఏర్పాటుకు సంబంధించి పలు ఫిర్యాదులు రాగా.. అన్నింటికి కలిపి ఇండస్ట్రియల్ పార్క్ ఆవరణలో సుమారు ఎనిమిది గ్రామాల ప్రజలతో ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

ప్రతిపాదిత ప్రాజెక్టుల వారీగా ఇలా..

ఫార్మా పరిశ్రమలు: రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి, రాయపల్లి, జడ్చర్ల మండలంలోని గుండ్లగడ్డ తండా వాసులు..
పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్: జడ్చర్ల మండలంలోని వల్లూరు, ఉదండాపూర్
బాయిల్డ్ రైస్‌మిల్లు: జడ్చర్ల మండలంలోని గంగాపూర్
ఫార్మా పరిశ్రమ: పెద్దపల్లిలో ఫార్మా పరిశ్రమకు సంబంధించి జడ్చర్ల మండలం కొరంపేట వాసుల ఫిర్యాదుపై..
టెక్స్‌టైల్ కంపెనీ: రాజాపూర్ మండలంలోని పెద్దగడ్డ, చెన్నవెల్లి (ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ కంపెనీ మూతపడింది. అయినా ఆయా గ్రామాల ప్రజలను ఆహ్వానించారు)
కెమికల్ కంపెనీ: పోలేపల్లి, నవాబుపేట, రాజాపూర్ శివారులోని కెమికల్ కంపెనీపై ఫిర్యాదు మేరకు నవాబుపేట మండలం ఇప్పటూరు గ్రామస్తుల నుంచి అభిప్రాయం సేకరించనున్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

- కలెక్టర్ రవినాయక్



నులి పురుగుల నివారణ వాల్‌పోస్టర్ విడుదుల చేస్తున్న కలెక్టర్ రవినాయక్ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లల తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు. ఇందుకు గాను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతోపాటు, విద్య, సంక్షేమ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని, అన్ని హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 2, రెండు లక్షల 78,500 మందిని గుర్తించడం జరిగిందని, వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించేలా చూడాలన్నారు. ఏదైనా కారణం చేత మాత్రలు వేయించని పిల్లలకు 27న తప్పకుండా వేయించాలని చెప్పారు. జిల్లాకు 3,55,400 మాత్రలు వచ్చాయని, వీటన్నిటిని సక్రమంగా వేయించే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎంహెచ్‌ఓ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీఈఓ రవీందర్, బీసీ సంక్షేమాధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు..
దోమల కారణంగా ప్రజలు అనారోగ్యం బారినపడకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమల వృద్ధి పెరగకుండా చూడాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలోనే డెంగీ వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా జిలావ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలన్నారు. నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. అనంతరం కలెక్టర్ డెంగీ వ్యతిరేక మాసోత్సవంపై తయారు చేసి కరప్రతం, బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం ధరణి దరఖాస్తులు, ప్రజావాణి, ఈ ఆఫీస్ సమస్యలు, జిల్లాకేంద్రంలో అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

'దళితబంధు' కేటాయింపులో మాలలపై వివక్ష

మహబూబ్‌నగర్ రూరల్: దళితుల సాధికారత కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకం కేటాయింపులో మాలలను విస్మరించడం తగదని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటస్వామి అన్నారు. నియోజకవర్గానికి వంద యూనిట్లు కేటాయించగా ఇందులో మాలలకు కేవలం 1- 20 యూనిట్లు మాత్రమే కల్పించి మిగతా ఒకే కులానికి కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలపై సీఎం చూపిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఒకరోజు నిరసన చేపడుతామన్నారు. మొదటి విడతలో చేసిన తప్పును రెండో విడతలో సరిదిద్దుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపేందుకు రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిన్న, ప్రధాన కార్యదర్శి అమరేందర్, జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నాయకులు ఆనంద్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వేగంగా చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తోందని, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ కె.నరసింహ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోరి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఫిర్యాదులు స్వీకరించారు. ఆరుగురు బాధితులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారు ఇచ్చిన ఫిర్యాదులపై ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడారు. పోలీస్ పరిధిలో ఉన్న ప్రతి అంశాన్ని పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

గొప్ప కళాకారుడిని కోల్పోయాం: మంత్రి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ సాయిచంద్ లాంటి ఓ గొప్ప కళాకారుడిని కోల్పోయిందని, ఇది ఎంతో బాధాకరమైన సంఘటన అని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సాయిచంద్ భార్యకు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చి ఆ కుటుంబానికి సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం, కవులు, రచయితలు, కళాకారులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాయకుడు సాయిచంద్ సంస్మరణ సభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి.. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో సాయిచంద్ పాత్ర ఎంతో విలువైనదని కొనియాడారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలచందర్, జయన్న, శివన్న, సీతారాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

క్లుప్తంగా

జడ్చర్ల మున్సిపాలిటీలో విషాదం

- ఒకేరోజు ముగ్గురు కార్మికుల మృత్యువాత


మాసయ్య(ఫైల్)

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీలో విషాదం నెలకొంది. ఒకేరోజు ముగ్గురు కార్మికులు వేర్వేరు ప్రమాదాల్లో మృత్యువాత పడడంతో తోటి కార్మికులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనులు చేస్తున్న నాగార్జున, చెన్నయ్యలు మిడ్జిల్ మండల పరిధిలోని వాడ్యాల శివారులో ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. అదేరోజు రాత్రి జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీపంలో మరో మున్సిపల్ కార్మికుడు బూర మాసయ్య(58) రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మున్సిపల్ కార్మికులు ఏక కాలంలో మృతి చెందడంతో పాలక మండలి చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ మహ్మద్ షేక్‌లు ఆయా కుటుంబాలను పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు.

గురుకుల విద్యార్థినికి పాముకాటు

- జిల్లా ఆస్పత్రికి తరలింపు

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థినికి పాము కాటు వేయడంతో వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్‌కు చెందిన జానకి మరికల్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఉదయం 7 గంటల సమయంలో హాస్టల్ గది నుంచి బయటకు వస్తుండగా పామును చూసి కిందపడింది. పాము కాటు వేసినట్లు అనుమానం రావడంతో పాఠశాల సిబ్బంది పక్కనే ఉన్న పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు కాళ్లకు రెండు చిన్నగా కాట్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ ఉదయం జానకికి మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి డిశ్చార్జి చేసుకొని తీసుకొచ్చినట్లు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామానికి చెందిన వ్యక్తి పాటుకాటుకు గురై మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి అశోక్(38), లత దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హైదరాబాద్‌లో ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేసే అశోక్ రెండేళ్ల క్రితం గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఇంట్లోనే అశోక్‌ను పాముకాటు వేసింది. కొంత ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్దకు తీసుకెళ్లి అక్కడ నాటుమందు తాగించగా వాంతులు చేసుకున్నాడు. విషం తగ్గిందనుకున్న కుటుంబ సభ్యులు అశోక్‌ను రాచాలకు తీసుకెళ్లారు. అర్ధరాత్రి తర్వాత పరిస్థితి విషమంగా మారడంతో వనపర్తి జిల్లాలోని కడుకుంట్లకు తీసుకెళ్లారు. అక్కడ నాటుమందు వేసే వారు అశోక్ పరిస్థితి విషమంగా ఉందని గుర్తించి వెంటనే వనపర్తి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు రాచాలలో అశోక్ అంత్యక్రియలు నిర్వహించారు.

కడుపునొప్పి భరించలేక బలవన్మరణం

బిజినేపల్లి: కడుపునొప్పి భరించలేక వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మంగనూర్ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సద్దాంహుస్సేన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎల్లస్వామి (53)కి ఆదివారం రాత్రి తీవ్రంగా కడుపు నొప్పి వచ్చింది. నొప్పి భరించలేక చెరువు సమీపంలోని చెట్టుకు తన పంచెతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లస్వామి కన్పించడం లేదని కుటుంబ సభ్యులు ఉదయం వెతకగా చెరువు వద్ద చెట్టుకు వేలాడుతున్న మృతదేహం కనిపించడంతో బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్య

హన్వాడ: కడుపునొప్పి భరించలేక గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంబాద్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జయమ్మ(48) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోయింది. కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. సాయంత్రం కుటుంబీకులు ఇంటికి రాగా తలుపులు తెరవకపోవడంతో బద్దలు కొట్టారు. అప్పటికే ఆమె మృత్యువాత పడడంతో బోరున విలపించారు. ఆమె భర్త కృష్ణయ్య 8 ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఆమెకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

కప్లాపూర్‌లో డెంగీ..

- పది మందికి చేరిన బాధితులు
- పట్టించుకోని అధికారులు




కప్లాపూర్ గ్రామం

గండీడ్ : మండలంలోని కప్లాపూర్ గ్రామంలో డెంగీ విజృంభిస్తోంది. గ్రామానికి చెందిన కయ్య అనంతయ్య కుమారుడు అరుణ్‌కు ఎనిమిది రోజుల క్రితం జ్వరం రావడంతో కోస్గి ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజులైన తగ్గక పోవడంతో తాండూర్ ఆదిత్య ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్త పరీక్షలు చేయించగా డెంగీ ఉన్నట్లు నిర్ధారించారు. ప్లేట్‌లెట్స్ 24వేలకు తగ్గడంతో హైదరాబాద్ మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన అయ్యమోల్ల పాండుకు ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు నిహారికకు జ్వరం వచ్చింది. రెండో రోజు రెండో కూతురు శ్రావ్యకు, మరుసటి రోజు కుమారుడు మనోహర్‌కు జ్వరం రావడంతో కోస్గిలో ముగ్గురికి పరీక్షలు చేయించగా డెంగీ వచ్చినట్లు తేలింది. డెంగీ వైద్య పరీక్షలకు లక్షల్లో ఖర్చవుతోంది.

దోమల నివారణకు చర్యలేవి?

దోమల నివారణకు గ్రామంలో సరైన చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. నాలుగు నెలల నుంచి ఫాగింగ్ చేయడం లేదు. ఎక్కువ మంది డెంగ్యూ బారిన పడడంతో కార్యదర్శి ఆది, సోమవారాల్లో సాయంత్రం ఫాగింగ్ చేయించారు. సరైన శుభ్రత చర్యలు తీసుకోకపోవడంతో రోజు రోజుకు బాధితుల సంఖ్య పెరుగుతున్నది.

పట్టించుకోని అధికారులు..

గ్రామంలో ఏకంగా పదిమందికి డెంగీ రావడంతో కలకలం రేగుతోంది. పిల్లలకు మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు, వైద్య అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా గ్రామాన్ని సందర్శించలేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పది మందికి పైగా డెంగీ..

గ్రామంలో పదిమంది పిల్లలకు డెంగీ వచ్చింది. వాతావరణంలో మార్పుల వల్ల జ్వరాలు వస్తున్నాయని మొదట భావించారు. తగ్గకపోవడంతో రక్తపరీక్షలు చేయిస్తే డెంగీ ఉన్నట్లు బయటపడుతున్నది. ఇప్పటి వరకు అరుణ్‌తో పాటు అఖిలేష్, ప్రియదర్శిని, రక్షిత, మనోహర్, నిహారిత, శ్రావ్య, భానుప్రకాశ్‌రెడ్డి, మరి కొందరు డెంగీ బారిన పడ్డారు. వీరంతా నీలోఫర్, మల్లారెడ్డి, అమ్మ, బాలాజీ, ఆదిత్య తదితర ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో వ్యక్తి బోయిని అంజిలయ్యకు ప్లేట్‌లెట్స్ తగ్గడంతో మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతున్నాడు.


మహబూబ్‌నగర్ నవోదయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భానుప్రకాశ్‌రెడ్డి


కోస్గిలో చికిత్స పొందుతున్న చిన్నారి

ఫాగింగ్, బ్లీచింగ్ చేయిస్తున్నాం..

కొంత మందికి జ్వరాలు వచ్చాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని నివారణ చర్యలు చేపట్టాం. ఇప్పటికే బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాం. అంతకు ముందు కూడా క్రమ తప్పకుండా పారిశుద్ధ్యం పనులు చేపడుతున్నాం.

– అరుణజ్యోతి, సర్పంచ్, కప్లాపూర్

పట్టపగలే చోరీ

- 5 తులాల బంగారం, 14 తులాల వెండి అపహరణ


దొంగలు పగులకొట్టిన బీరువా

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భాస్కర్ జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అతను ఇంట్లో లేని సమయంలో ఆయన భార్య లావణ్య అడ్డాకులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి 5 తులాల బంగారు నగలు, 14 తులాల వెండి నగలను దోచుకెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చిన అతని భార్యం తలుపులు తీసి చూడగా బీరువా తెరుచుకొని కనిపించడంతో దొంగలు పడ్డారని గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి విచారణ చేశారు. క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆధారాల కోసం పరిశీలించారు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌పై యుద్ధం జడ్చర్ల నుంచే..


హన్మసానిపల్లిలో కొనసాగుతున్న ప్రజాహిత పాదయాత్ర

- పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట : బీఆర్‌ఎస్ పార్టీపై యుద్ధం జడ్చర్ల నియోజకవర్గం నుంచే ప్రారంభమైందని, కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలో చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర రెండో రోజు సోమవారం హన్మసానిపల్లి, కూచూర్, దొడ్డిపల్లి, మల్లరెడ్డిపల్లి, ఇప్పటూర్ గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు విస్మరించిన కేసీఆర్ సర్కార్ ఓటమి భయంతో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలు తాము ఇస్తామని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం..

జడ్చర్ల నియోజకవర్గంలో ఉన్న అనాథ పిల్లలకు విద్య, తదితర విషయాల్లో అండగా ఉండి ఆదుకుంటామని అనిరుధ్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు అన్నిరకాల సహకారం అందిస్తామన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు రబ్బాని, డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, తులసీరాంనాయక్, ఆజనేయులు, కుమార్, నర్సింహ, అమరేష్, సురేష్, డాక్టర్ మీనాక్షి, జ్యోతి ఉన్నారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి


కురుమూర్తి (ఫైల్)

కొల్లాపూర్: కొల్లాపూర్ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లాపూర్‌కు చెందిన తెలుగు పిట్టల కురుమూర్తి(45) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. గతంలో అతనికి ఖాదర్‌బాష దర్గా వద్ద ఉన్న కాలువకు వెళ్లి స్నానం చేసి బట్టలు ఉతుక్కొని వచ్చేఅలవాటు ఉండేది. సోమవారం ఆ పరిసర ప్రాంతాల్లో వెతకగా కాలువలో అతని మృతదేహం కనిపించింది. వెలికితీసి పోలీసులు పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమర్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకట్రాములుగౌడ్ తెలిపారు. అతనికి భార్య ఈదమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంటిని ఢీకొన్న లారీ

- ఇల్లు ధ్వంసం.. ఇద్దరికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరేష్


చారకొండలో ఇల్లును ఢీకొన్న లారీ

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి 8గంటల సమయంలో జెడ్పీహెచ్ఎస్ సమీపంలో మలుపు వద్ద ఆగిఉన్న కంటైనర్‌ను వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. వెనకాల వస్తున్న మరో లారీ ముందున్న వాహనాలను తప్పించబోయి రోడ్డు పక్కనున్న రేకుల ఇంటిని ఢీ కొట్టింది. దీంతో ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఇంట్లో ఉన్న మహిళ నారమ్మకు, ద్విచక్ర వాహనదారుడు నరేష్ తలకు, చేతులకు గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ రవి పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలైన వారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గద్వాల క్రైం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం గద్వాల ధరూర్‌మెట్టు కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ తెలిపారు. పట్టణంలోని ధరూర్ మెట్టు కాలనీకి చెందిన చాకలి మాణిక్యమ్మ (50) ఇంట్లో తాగునీటి మోటర్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లగా షాక్‌సర్క్యూట్‌కు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో సాయంత్రం చికిత్స పొందుతూ చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చిన్నచింతకుంట : కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు(42) కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ ఆర్ శేఖర్ తెలిపారు.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం : మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,018 అడుగులకు నీరు వచ్చి చేరింది. జూ రాల ఎడమ కాలువ, సమాంతర కాలువ, వచ్చే నీటిని నిలిపేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాలువ నీటిని ఆపేశారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కాపీయింగ్‌కు పాల్పడిన వారు హాజరుకావాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఇటీవలి నిర్వహించిన రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడి డిబార్ అయిన విద్యార్థులు బుధవారం ఎంవీఎస్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్ కమిటీ ముందు హాజరుకావాలని పరీక్షల నియంత్రణాధికారి రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మధ్యాహ్నం 12 గంటల వరకు కచ్చితంగా హాజరుకావాలని సూచించారు.

విద్యార్థి అదృశ్యం

జడ్చర్ల: గురుకుల విద్యాలయంలో చేర్పిస్తానని తండ్రి చెప్పిన మాటలకు భయపడిన కుమారుడు ఇల్లు విడిచి వెళ్లిన ఘటన జడ్చర్ల పాతబజార్‌లో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. పాతబజార్‌కు చెందిన గాలిగూడెం రాములు కుమారుడు విజయ్‌నర్సింహ్మ (14)కు నవాబ్‌పేట మండలంలోని గురుకుల విద్యాలయంలో 9వ తరగతి చదివేందుకు సీటు వచ్చింది. ఈనెల 2న రాత్రి భోజనం చేసే సమయంలో తండ్రి ఈ విషయం చెప్పి 3వ తేదీన గురుకులకు వెళ్దామని కుమారునికి చెప్పాడు. అప్పుడు సరే అని ఇంటిలో అందరు నిద్ర పోయిన తర్వాత కుమారుడు ఇల్లు విడిచి వెళ్లాడు. తెల్లారక కుమారుడి ఆచూకి కోసం చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా ప్రయోజనం లేదు. దీంతో సోమవారం కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి

కల్వకుర్తి టౌన్: రోడ్డు దాటేందుకు యత్నిస్తుండగా లారీ ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు... తమిళనాడులోని నిరుదవజేరికి చెందిన విఘ్నేష్(25) వలస కూలి. గుడి నిర్మాణ పనిలో మేస్త్రి. ఈ క్రమంలోనే సోమవారం కల్వకుర్తికి వచ్చారు. వెల్దండ మండలంలోని ఓ గ్రామంలో తన పనులు ముగించుకొని పట్టణంలోని పద్మశ్రీ నగర్ కాలనీలో తన రూంకు చేరుకున్నాడు. రూంలో సామాన్లు తీసుకొద్దామని బయటకు తన తోటి మేస్త్రీలతో బయటకు వెళుతుండగా, రోడ్డును దాటే క్రమంలో కల్వకుర్తి వైపుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమస్యల్లో కేజీబీవీలు

కేజీబీవీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. ఏ కస్తూర్బాను పరిశీలించినా ఏదో ఒక సమస్యతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కేజీబీవీల పరిస్థితిని క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు సోమవారం 'సాక్షి' విజిట్ నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలలు, హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు వెలుగుచూశాయి. కొన్నిచోట్ల బాలికలకు సరిపడా మరుగుదొడ్లు, సరైన నీటి వసతి లేకపోవడం, కేజీబీవీల చుట్టూ మురుగు పేరుకుపోవడం, చెత్తాచెదారంతో పారిశుద్ధ్యం లోపించడం వంటివి నెలకొన్నాయి. అలాగే మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోవడం, సరైన సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల నైట్ వాచ్‌మెన్లు లేకపోవడంతో భయంగా కాలం వెల్లదీస్తున్నామని పలువురు విద్యార్థినులు వాపోయారు. – చిన్నచింతకుంట/బాలానగర్/రాజాపూర్/మిడ్జిల్/భూత్పూర్/మహమ్మదాబాద్/నవాబుపేట



- జిల్లాలోని కస్తూర్బాల్లో కరువైన సౌకర్యాలు
- పలుచోట్ల కుళ్లిన గుడ్లు, కూరగాయలతో భోజనం
- మురుగు, మరుగుదొడ్ల సమస్యతో విద్యార్థినుల అవస్థలు
- పరిష్కారంలో కొరవడిన ప్రభుత్వ చిత్తశుద్ధి
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి..

పిచ్చిమొక్కలు.. చెత్తాచెదారం

పిచ్చి మొక్కలు పెరిగి దోమలు, విషస్వర్పాలు సంచరించే పరిస్థితులు చిన్నచింతకుంట కేజీబీవీ పాఠశాల ఆవరణలో నెలకొంది. వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారంగా మారింది. పాఠశాలకు మిషన్ భగీరథ నీరు అందుతున్నప్పటికీ సంపు లేకపోవడంతో కరెంట్ లేని సమయంలో విద్యార్థినులు స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 250 మంది విద్యార్థినులకు 30 మాత్రమే స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండటంతో విద్యార్థులు గంటల తరబడి లైన్‌లో నిల్చోవాల్సి వస్తుంది.

వంట మనుషుల కొరత

బాలానగర్‌లోని కేజీబీవీలో వంట మనుషుల కొరత వలన వంట చేయడంలో కాస్త ఆలస్యమవుతుంది. ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులకు వంట చేయడానికి మొత్తం ఐదు మంది సిబ్బంది అవసరం ఉండగా.. ఏడాది నుంచి ముగ్గురితో మాత్రమే నెట్టుకొస్తున్నారు.

కేజీబీవీ చుట్టూ మురుగు

నవాబుపేటలోని కేజీబీవీ చుట్టూ మురుగు పారుతోంది. పాఠశాలలో 378 మంది విద్యార్థినులు ఉండగా.. వంట మనుషుల కొరత మూలంగా భోజనం వండి పెట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో మెనూ బోర్డు లేకపోవడంతో ప్రిన్సిపల్ చెప్పిందే వండి పెడుతున్నారు. పాఠశాలకు మిషన్ భగీరథ నీటి సౌకర్యం ఉన్నా.. ప్రత్యేక వసతి లేదు.

అనుమతులు రాలేదు.

రాజాపూర్‌లోని కేజీబీవీ మిషన్ భగీరథ నీటి సౌకర్యానికి నోచుకోవడం లేదు. గతేడాది నూతన భవనాన్ని ప్రారంభించడంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత లేకున్నా.. ఫస్ట్ ఫ్లోర్ పనులు పూర్తికాకపోవడంతో ఈ సంవత్సరం అమలు కావాల్సిన ఇంటర్మీడియట్‌కు అనుమతులు రాలేదు.

తాగునీటి సౌకర్యం..



గతంలో అద్దె భవనంలో ఉన్నప్పుడు ఇబ్బందులు ఉండే ఇప్పుడు ఆ సమస్య లేదు. కానీ, మిషన్ భగీరథ నీటి సౌకర్యం కల్పిస్తే బాగుంటది. ప్రస్తుతం బోరు నీటినే ఫిల్టర్ చేయడంతో వాటినే తాగుతున్నాం. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, టిఫిన్ అందిస్తున్నారు.

– స్పందన, విద్యార్థిని, రాజాపూర్

మురుగు నిల్వతో అవస్థలు



మిడ్జిల్‌లోని కేజీబీవీలో దాదాపు 250 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ 5 మరుగుదొడ్లు మాత్రమే ఉండగా అందులోనూ రెండే పనిచేస్తున్నాయి. నీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీనికితోడు పాఠశాల ఆవరణలో మురుగు నిల్వ ఉండటంతో గడ్డి ఏపుగా పెరిగి పాములు తరచుగా వస్తున్నాయి. అలాగే దుర్వాసన వెదజల్లుతోంది.

వాచ్‌మేన్ లేక భయాందోళన..



భూత్పూర్ కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. గత మూడేళ్ల నుంచి ఇక్కడ నైట్ వాచ్‌మెన్‌ను నియమించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అలాగే ట్యాంకు లేకపోవడంతో మరుగుదొడ్లకు వెళ్లేందుకు విద్యార్థినులు బకెట్‌లో నీరు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి ట్యాంకుకు బీటలు వారడంతో నీరు లీకవుతుంది.

మెనూ పాటించరా?


మహమ్మదాబాద్ కేజీబీవీలో పనిచేయని వాటర్ ప్లాంట్

మహమ్మదాబాద్ గురుకుల పాఠశాలలో మెనూ పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సోమవారం గుడ్డు పెట్టాల్సి ఉండగా పట్టించుకోలేదు. అలాగే మినరల్ వాటర్ లేకపోవడంతో నిత్యం బోరు నీటినే తాగాల్సి వస్తుంది. ఇతర అవసరాలకు సైతం సింగిల్ ఫేజ్ బోరు మాత్రమే ఉండటంతో సరిపడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. గదుల్లో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో బాధపడుతున్నారు.

'అదృశ్యం' అవాస్తవం!

పవన్ కళ్యాణ్ ఆరోపణలు నిరాధారం: పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారని, అందుకు వలంటీర్లే కారణమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని పోలీసు శాఖ స్పష్టం చేసింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను వక్రీకరించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకే ప్రయత్నించారని ఓ ప్రకటనలో పేర్కొంది. దిశ వ్యవస్థ, జీరో ఎఫ్ఐఆర్ లాంటి సంస్కరణలతో దేశంలోనే మహిళా భద్రతలో ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేసింది. 2019–21 మధ్య రాష్ట్రంలో 30 వేల మంది మహిళల అదృశ్యం కేసులు నమోదు కాగా 14 వేల మంది ఆచూకీ మాత్రమే కనుగొన్నట్లు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని పేర్కొంది. ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ఇంట్లో ఘర్షణలు, మానసిక రుగ్మతలు తదితర కారణాలతో ఆచూకీ తెలియని కేసులన్నింటినీ పోలీసులు మిస్సింగ్ కేసులుగానే నమోదు చేస్తారు.

ఆచూకీ గుర్తించి సురక్షితంగా..

2019 – 21 మధ్య అదృశ్యమైన మహిళలు మొత్తం 24,557 మంది. 2019కు ముందు అదృశ్యమై ఆచూకీ లభించని మహిళలు 1,542 మంది. మొత్తంమీద 2021 నాటికి అదృశ్యమైన మహిళల సంఖ్య 26,099. వీరిలో 2021 డిసెంబర్ నాటికి 23,394 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. మిగిలిన 2,705 మందిలో 500 మంది ఆచూకీని 2022–23లో కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా)కు పాల్పడినట్లు రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క వలంటీర్ పైనా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. వారిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. స్వచ్ఛంద సేవలో నిమగ్నమైన లక్షలాది మంది వలంటీర్లను కించపరుస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం గర్హనీయం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

పవన్ 'సంఘ విద్రోహ' వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన

ర్యాలీలు.. పలుచోట్ల దిష్టి బొమ్మలు, ఫొటోలకు నిప్పు



ప్రకాశం జిల్లా.. ఒంగోలు చర్చి సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: గ్రామాల్లో ఆత్మీయులకు స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంఘ విద్రోహ శక్తులతో పోల్చటంపై నిరసన జ్వాలలు భగ్గుమన్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఆప్యాయంగా పలుకరించే వలంటీర్ సోదరులకు దురుద్దేశాలను ఆపాదించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లుగా దాదాపు 53 శాతం మంది యువతులు సేవలందిస్తుండగా సాటి మహిళలకు వారెందుకు చేటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడ్డ వేళ బాధితుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే వెనుకాడినా వలంటీర్లు మానవత్వంతో అందించిన సేవలను గుర్తు చేస్తున్నారు. పవన్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల వలంటీర్లు ఆగ్రహంతో ఊగిపోతూ పవన్‌కళ్యాణ్ ఫోటోలు, పోస్టర్లను చెప్పుతో కొడుతూ నిరసన తెలిపారు. దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. జనసేన అధ్యక్షుడి అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వలంటీర్లు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. 'సేవా భావంతో పనిచేసే మా వలంటీర్ల జోలికొస్తే తాట తీస్తాం..' అంటూ హెచ్చరించారు. నిన్న.. వలంటీర్లను మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహులుగా అభివర్ణించిన పవన్‌కళ్యాణ్ తాజాగా వారు సేకరించే సమాచారం ఎక్కడెక్కడికో పోతోంది...! అది చాలా భయంకరమైన వ్యవస్థ.. ఇళ్లల్లోకి దూరుతున్నారు.. ! అవి ఊడిగం ఉద్యోగాలంటూ వలంటీర్ల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏపీలో మహిళల కిడ్నాప్‌లకు సంబంధించి తనకు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం ఉందని పవన్ చెబుతుండగా.. అదే నిజమైతే అలాంటి కీలక వివరాలను ఓ రాజకీయ నేతకు నిఘా వర్గాలు అందిస్తాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి స్క్రిప్ట్ సమకూర్చింది ఈనాడు రామోజీ కాగా చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ యాక్టింగ్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పది రోజుల్లో ఆధారాలివ్వాలి

- పవన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసు
- లేదంటే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు, మహిళా సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, అందుకు వలంటీర్లే కారణమంటూ భయభ్రాంతులకు గురి చేసేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. తమను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు వలంటీర్లు, మహిళా సంఘాల నేతలు మహిళా కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళగిరిలోని మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను కలిశారు. నిరాధార ఆరోపణలు చేసిన పవన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాసిరెడ్డి పద్మ మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా వలంటీర్లపై దారుణమైన కామెంట్లు చేసిన పవన్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దీనిపై ఆధారాలతో పది రోజుల్లోగా మహిళా కమిషన్‌కు వివరణ ఇవ్వాలని లేదంటే మహిళలకు పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలను అవమానించేలా మాట్లాడిన పవన్ తన వద్ద ఉన్న కేంద్ర ఇంటెలిజెన్స్ సమాచారాన్ని బయట పెట్టాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 88,836 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమలలో చిరుజల్లులు కురిశాయి. శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీశారు.

అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు

సాక్షి, అమరావతి: నంది నాటకోత్సవాలను అక్టోబర్ నెలలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో (రంగస్థల పురస్కారాలు) భాగంగా ఐదు విభాగాల్లో 73 అవార్డులను ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నంది నాటకోత్సవాల నిర్వహణపై నాటక రంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, పిల్లల లఘు నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ లఘు నాటిక (ప్లేలెట్స్) అనే ఐదు విభాగాల్లో అవార్డులు అందజేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చామని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండే ప్రాంతాన్ని నంది నాటకోత్సవాలకు వేదికగా ఎంపిక చేస్తామని తెలిపారు.

మినిస్టర్ క్వార్టర్స్ నీటి బకాయిలు

రూ 4.34 కోట్లు!



బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల మంచినీటి బిల్లులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో జలమండలి అధికారులు పెండింగ్ బిల్లులు రాబట్టుకోలేక సతమతమవుతున్నారు. మినిస్టర్ క్వార్టర్స్ వాటర్ కనెక్షన్లు కట్ చేయడానికి కూడా వెనుకాడబోమని ఈ ఏడాది మార్చిలో హెచ్చరికలు జారీ చేసినా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో 32 క్వార్టర్స్ ఉన్నాయి. 2009 నుంచి ఈ క్వార్టర్స్‌కు సంబంధించిన మంచినీటి బిల్లులు చెల్లించకపోవడంతో యేటికాయేడు అవి చాంతాడాంత పెరిగిపోతున్నాయి. ఇప్పటికీ బిల్లుల బకాయిలు రూ.4.34 కోట్లకు చేరుకున్నాయి. ఉమ్మడి ఏపీ నుంచే ఈ బిల్లులు బకాయి ఉన్నాయని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన ఆర్‌అండ్‌బీ ఈఈ ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి వాటర్ బిల్లులు విడుదల చేయాల్సిందిగా లేఖ కూడా రాశారు. ఇప్పటిదాకా దానికి స్పందన కరువైంది. బకాయిలు చెల్లించాలని జలమండలి అధికారులు ఎన్నోసార్లు ఆర్‌అండ్‌బి అధికారులకు లేఖలు రాయడమే కాకుండా మొరపెట్టుకుంటున్నారు. భారీగా బకాయిలు పేరుకుపోయాయని బోర్డుకు నష్టంవాటిల్లుతుందని ఆందోళన కూడా వ్యక్తం చేశారు. కొంతనైనా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వాటర్ కనెక్షన్లు కట్‌చేయకముందే చెల్లించండి అంటూ వేడుకున్నారు. అయినాసరే ఆర్‌అండ్‌బి అధికారులు కనికరించడం లేదు. సామాన్యులు ఒక నెల బిల్లు చెల్లించకపోతే వాటర్ కనెక్షన్ కట్‌చేసే జలమండలి అధికారులు మంత్రులు బిల్లులు చెల్లించకపోతే మాత్రం పుష్కర కాలంగా నోరెత్తడం లేదు. ఈ విషయంలో ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సామాన్యులకు ఒక న్యాయం, అమాత్యులకు మరో న్యాయమా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ఇంకా చెల్లించని కరెంటు బకాయిలు

మినిస్టర్ క్వార్టర్స్‌లో కరెంటు బకాయిలు ఏ నెలకా నెల పెరిగిపోతున్నాయి. 2022 ఆగస్టు నుంచి మినిస్టర్ క్వార్టర్స్ కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటికే ` 70 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులను వేడుకుంటున్నా స్పందన కరువవుతున్నది. భారీగా కరెంటు బిల్లులు పేరుకుపోతుండటంతో సంబంధిత ఏఈలకు విద్యుత్ ఉన్నతాధికారులు మెమోలు జారీచేస్తున్నారు ఇంక్రిమెంట్లు కట్ చేస్తున్నారు. ప్రతిరోజూ పెండింగ్ బిల్లుల వసూళ్లు ఎంత వరకు వచ్చాయంటూ తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. అమాత్యులు మాత్రం స్పందించకపోగా ఈ బిల్లులు చెల్లించాల్సిన ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు నోరెత్తడం లేదు.

రూ.5 వేలకు ఊడిగం చేసే ఉద్యోగం 'వలంటీరు'

- సున్నితమైన సమాచారాన్ని వలంటీర్లు సేకరిస్తున్నారు
- వితంతువులు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి
- ఏలూరు జనసేన వీర మహిళల సమావేశంలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు : 'వలంటీరు పోస్టు అనేది రూ.ఐదు వేలకు ఊడిగం చేసే ఉద్యోగం. ఐదు లక్షల మంది వలంటీర్లకు ప్రజల డబ్బుతో జీతం ఇస్తున్నారు. వలంటీర్లు ప్రభుత్వోద్యోగులు కానప్పుడు.. ప్రభుత్వంలో అనేక వ్యవస్థలు ఉన్నప్పుడు వలంటీర్లతో అసలు పనేముంది?'.. అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీరు వ్యవస్థపై మరోసారి నోరుపారేసుకున్నారు. ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, వీర మహిళల సమావేశంలో పవన్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. జనసైనికులు అవసరమైతే వలంటీర్లను నిలదీయాలి. ఏపీలో ఎంతమంది అమ్మాయిలు మిస్సవుతున్నారో ఆ డేటా మీ దగ్గర ఉందా అని, నిఘా వర్గాల్లో ముఖ్యులు నన్ను అడిగితే నా మతిపోయింది. ప్రతి గ్రామంలో పదిమంది యువకులు వలంటీర్ల పేరుతో ఇంటింటికీ తిరుగుతూ సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలున్నాయా.. వితంతు మహిళలున్నారా, భర్తలు బయటకు వెళ్లాక భార్యలు ఏం చేస్తున్నారు? ఇలా సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ పెట్టిన మొదట్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ బలోపేతానికి అని అనుకున్నాం. కానీ, ఇది చాలాచాలా భయంకరమైన వ్యవస్థగా మారిపోయింది. ఇది అందరి వలంటీర్ల గురించి కాదు.. కొందరి గురించే. అయితే, డేటా మాత్రం కచ్చితంగా వెళ్తోంది. వలంటీర్లు తప్పుచేస్తే ఎవరికి చెప్పాలి. వారేమో ప్రభుత్వోద్యోగులు కాదంటారు. వలంటీర్లు ఇబ్బంది పెడుతుంటే టోల్‌ఫ్రీ నంబర్ ఉండాలి. ఇక రేషన్ డీలర్ల వ్యవస్థను చంపేసి 10 వేల వ్యాన్లు ఇచ్చారు. ఈ వ్యవస్థపై పర్యవేక్షణలేదు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి.

మార్కెట్‌లోకి ఎక్స్‌టర్ మినీ ఎస్‌యూవీ విడుదల



పాలమూరు: హ్యూందాయ్ కంపెనీ నుంచి మరో నూతన మోడల్ కారు ఎక్స్‌టర్ మినీ ఎస్‌యూవీని సోమవారం జిల్లాకేంద్రంలోని ట్రెడ్ హ్యూందాయ్ షోరూంలో డైరెక్టర్ హర్షిత్‌రెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా నూతన సాంకేతికతతో హ్యూందాయ్ కార్లు తయారవుతున్నాయన్నారు. ఇప్పుడు కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన ఎక్స్‌టర్ మినీ ఎస్‌యూవీ ఇంజిన్ దీర్ఘకాలికంగా మన్నికతో ఉండటంతో పాటు తక్కువ ఖర్చుతో నిర్వహించుకోవచ్చునని తెలిపారు. 83బీఎస్, 6000ఆర్‌పీఎం, 4సిలిండర్ల ఇంజిన్ కలిగి ఉందన్నారు. మాన్యువల్‌తో పాటు ఆటోమోటెడ్ ట్రాన్స్‌మిషన్ మోడల్‌లో కారు అందుబాటులో ఉందని, సీఎన్‌జీ ఇంజిన్‌తో అత్యధిక మైలేజ్ ఇస్తుందన్నారు. అన్ని వేరియంట్‌లలో ఆరు ఎయిర్‌బ్యాగ్స్ ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం ఏడు రంగులలో అందుబాటులో ఉందన్నారు. ఎక్స్ షోరూం ధర. రూ.5.99 లక్షల నుంచి రూ.9.32 లక్షల వరకు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం సెల్స్ మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి, సర్వీస్ మేనేజర్ మహ్మద్ వాసిమ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఆటంకం

- లైన్ల కిందే మొక్కల పెంపకం
- సరఫరా నిలిపేసి కొమ్మల తొలగింపు
- ఈదురు గాలులొస్తే కరెంట్ కట్



జడ్చర్లలో జాతీయరహదారిపై గంగాపురం కమాన్‌వద్ద విద్యుత్‌లైన్ కింద తొలగించిన కొమ్మలు

జడ్చర్ల టౌన్: మున్సిపల్, పంచాయతీరాజ్, ఈజీఎస్, విద్యుత్‌శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా వేలాది మొక్కలు రోడ్లకు ఇరువైపులా నాటుతున్న సంగతి తెలిసిందే. అదే విద్యుత్‌శాఖకు తలనొప్పిగా మారింది. విద్యుత్‌లైన్ల కింద మొక్కలు నాటుతుండటంతో కొంతకాలానికి అవి పెరుగుతున్నాయి. దీంతో లైన్లకు కొమ్మలు తగిలి తరచూ ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వాటిని తొలగించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు ఏటా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సమస్యగా మారిన అవెన్యూ ప్లాంటేషన్..

అవెన్యూ ప్లాంటేషన్ కోసం 8నుంచి 10అడుగుల మేర పెరిగిన కోనోకర్పస్ వంటి పెద్ద మొక్కలు నాటుతున్నారు. దీంతో మూడు, నాలుగేళ్లలో అవి పెద్దవిగా మారి విద్యుత్ లైన్లకు తగులుతున్నాయి. ఈదురుగాలులు బలంగా వీయడంతో 33కేవీ, 11కేవీ లైన్లు ట్రిప్ అవుతున్నాయి. దీంతో ఎక్కడ ట్రిప్ అయ్యిందో తెలుసుకునేందుకు విద్యుత్ అధికారులకు సమస్యగా మారుతుంది.

అంబ్రెల్లా మొక్కలు నాటితే ప్రయోజనం..

అవెన్యూ ప్లాంటేషన్‌లో అంబ్రెల్లా మొక్కలు నాటితే ప్రయోజనం ఉంటుందని అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాల్సి ఉంది. కానుగ, పొగడ, టికోమా, పైకస్‌బెంజామియా, సీత అశోకలాంటి మొక్కలు నాటి వాటిని ఎప్పటికప్పుడు కావాల్సిన ఆకారంలో కట్ చేసుకుంటే విద్యుత్ తీగలకు తగిలే ఆస్కారం ఉండదు. దాంతోపాటు కానుగ, పొగడ చెట్లు సమృద్ధిగా నీడను సైతం ఇస్తాయి.

నాలుగు రోజుల క్రితం..

నాలుగు రోజుల క్రితం విద్యుత్‌శాఖ అధికారులు జడ్చర్ల, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలతోపాటు కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. రోడ్డు పొడుగునా ఉన్న చెట్ల కొమ్మలు తీసివేసి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఒకసారి కొమ్మలు తొలగించటం మళ్లీ ఏడాదికి అవి పెరిగి అదే సమస్య ఉత్పన్నం అవుతుంది.

ప్రతి సారి సమస్యే..

ఏటా రెండు పర్యాయాలు విద్యుత్ సరఫరా నిలిపివేసి లైన్లకు ఆటంకంగా మారిన చెట్ల కొమ్మలు తొలగించాల్సి వస్తుంది. బలమైన ఈదురు గాలులు వీచిన సమయంలో చెట్లకొమ్మలు లైన్లకు తగిలి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. రోడ్డుపక్కనే మేం విద్యుత్ స్తంభాలు వేయాల్సి వస్తుంది. అక్కడే మొక్కలు నాటుతున్నారు. పెద్దవిగా పెరిగే మొక్కలు నాటకుండా చూస్తే బాగుంటుంది.

– శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏడీఈ, జడ్చర్ల సబ్‌డివిజన్

పరిశీలిస్తాం..

రోడ్డుకిరువైపులా మొక్కలు నాటాలనే లక్ష్యంతో గతంలో విద్యుత్‌లైన్ల కిందే మొక్కలు నాటాల్సి వచ్చింది. ఈ సారి అలా కాకుండా ఉండేందుకు పరిశీలిస్తాం. అవసరమైతే ఎత్తు తక్కువగా పెరిగే మొక్కలపై దృష్టి కేంద్రీకరిస్తాం. ఈ విషయంలో పాలకవర్గం, విద్యుత్, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటాం.

– మహమూద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

పొగడ, కానుగ మొక్కలు నాటాలి..

అన్ని పెద్ద పట్టణాలు, గ్రామాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. రోడ్డు పక్కన విద్యుత్‌లైన్ల కిందే మొక్కలు నాటాల్సి వచ్చినపుడు పొగడ, కానుగ, సీత అశోక, టికోమా, పైకస్‌బెంజామియా వంటి అంబ్రెల్లా లా పెరిగే మొక్కలు తీసుకురావాలి. పొగడ చెట్టు విద్యుత్‌లైన్ వరకు పెరిగేందుకు కనీసం 30ఏళ్లు పడుతుంది. అప్పటి వరకు సమస్య తలెత్తదు. బొటానికల్ గార్డెన్ తరపున అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డా.సదాశివయ్య, సమన్వయకర్త, బొటానికల్ గార్డెన్, జడ్చర్ల

నలుగురు ఎస్ఐలు బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ సోమవారం జోగుళాంబ గద్వాల 7వ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే నాలుగు దశల్లో జిల్లాలో ఎస్ఐలకు స్థానచలనం కలిగించారు. మళ్లీ తాజా మరో నలుగురు ఎస్ఐలను బదిలీ చేయడం విశేషం.

ఎస్ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జయప్రసాద్	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	నారాయణపేట రూరల్ పీఎస్
ఎ.నాగరాజు	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	ఎస్ఐ-2 జడ్చర్ల
పి.శ్రీనివాసులు	సీసీఎస్,అటాచ్ రూరల్ పీఎస్	భూత్పూర్
వై.భాగ్యలక్ష్మీరెడ్డి	ఎస్ఐ-2 భూత్పూర్	డీటీసీ, జడ్చర్ల

కృష్ణానదిలో సాయిచంద్ అస్థికల నిమజ్జనం

ఎర్రవల్లిచౌరస్తా: జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం వద్ద కృష్ణానదిలో ఉద్యమగాయకుడు సాయిచంద్ అస్థికలను నిమజ్జనం చేశారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన సాయిచంద్ అస్థికలను తీసుకొని ఆయన భార్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రజినీ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం బీచుపల్లికి వచ్చారు. పుష్కరఘాట్ దగ్గర పురోహితుడు నవీన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించి.. కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.



బీచుపల్లిలో సాయిచంద్ అస్థికలకు పూజలు చేస్తున్న కుటుంబసభ్యులు

పట్టుబడిన బియ్యంపై విచారణ



డీసీఎంను పరిశీలిస్తున్న స్వామికుమార్



మిల్లులో దించిన బియ్యం సంచులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామ సమీపంలోని రైస్ మిల్లు నుంచి బియ్యాన్ని డీసీఎంలో జడ్చర్లకు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఆ వాహనంలో 146 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అదేరోజు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు రోజులు సెలవు కావడంతో సోమవారం అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి స్వామికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్‌లు పోలీస్‌స్టేషన్‌లో డీసీఎంను పరిశీలించారు. అందులో ఉన్న బియ్యాన్ని పట్టణ సమీపంలోని బాయిల్డ్ మిల్లుకు తరలించి అక్కడ దంపు చేశారు. మూడు శాంపిళ్ల బియ్యాన్ని ల్యాబ్‌కు పంపి పరిశీలించిన తరువాత రేషన్ బియ్యమా? కాదా అనే విషయాన్ని నిర్ధారిస్తామన్నారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా రేషన్ బియ్యమని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం తర్నికల్, బిజినపల్లి రైస్‌మిల్లుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లపై అధికారుల వేధింపులను నిరసిస్తూ సోమవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అంతకుముందు మున్సిపల్ టౌన్ హాల్ నుంచి ప్రదర్శనగా నూతన కలెక్టరేట్‌కు చేరుకుని అధికారుల రాకపోకలను అడ్డుకున్నారు. ఒక దశలో టీచర్లు, ఆయాలు గేట్లను తోసుకొని కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేసి, గ్రాడ్యుటీ, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తిపలికి, ప్రభుత్వ ఆధీనంలోనే ఐసీడీఎస్‌ను కొనసాగించాలని, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలన్న ఆలోచనను విరమించుకోవాలని హితవు పలికారు. జిల్లా అధ్యక్షురాలు పుష్పలత మాట్లాడుతూ బీఎల్ఓ డ్యూటీల పేరుతో అధికారుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు దాపురించాయన్నారు. అధికారుల వేధింపులు భరించలేక ఎంతోమంది మానసికంగా కృంగిపోతున్నారని, బీఎల్ఓ డ్యూటీలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ సీతారామారావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాజ్‌కుమార్, ప్రభావతి, సరోజ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముఖద్వారం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ టీచర్లు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పాలమూరు: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లా న్యాయ అధికార సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాంరెడ్డి గూడెం దగ్గర ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీసులకు లేదా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై కఠినచర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా రచ్చబండ ద్వారా పరిష్కారం చేసుకునేవారని, కాలక్రమేణా సమస్యలు ఎక్కువ కావడం వల్ల సుప్రీంకోర్టు ఆదేశాలతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు అనవసర విషయాలపై దృష్టి పెట్టకుండా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.